నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

3 | నల్లగొండ, శనివారం 9 మార్చి 2024 | SURYAPET




వాడపల్లి మీనాక్షి అగస్తేశ్వరాలయంలో పూజలు చేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

# శంభో శంకర

## ఉమ్మడి జిల్లాలో భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి వేడుకలు

### ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. మార్మోగిన శివనామ స్మరణ

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది. ఆలయాల్లో భక్తులు శివ లింగాలకు అభిషేకాలు, పూజలు చేశారు. ఉపవాసాలు, జాగరణతో గడిపారు. భక్తిపాటలతోపాటు హర హర మహా దేవ.. శంభో శంకర, ఓం నమఃశివాయ నామస్మరణలు మార్మోగాయి. జిల్లాలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరాలయం, పానగల్ ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలు, మేళ్లచెర్వు శంభు లింగేశ్వరస్వామి, వాడపల్లి అగస్తేశ్వర స్వామి, పిల్లలమర్రి ఎరుకేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా కొన్ని చోట్ల పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలు చేపట్టారు. పలు చోట్ల జరిగిన వేడుకల్లో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మేళ్లచెర్వులో స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



భక్తులతో నిండిపోయిన సూర్యాపేట పిల్లలమర్రి ఎరుకేశ్వరాలయం





నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో ప్రత్యేక అలంకరణలో శివలింగం



పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



తిప్పర్తి మండలం ఇండ్లూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

# 700 కోట్లతో నల్లగొండకు బైపాస్ రోడ్డు

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నీలగిరి/నల్లగొండ రూరల్/తిప్పర్తి/గుర్రంపోడ్, మార్చి 8 : నల్లగొండ పట్టణంలో 326 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని, మరో 700 కోట్లతో నల్లగొండకు బైపాస్ రోడ్డు నిర్మించి ఔటర్ రింగ్ రోడ్డు చేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో శుక్రవారం రూ.216 కోట్లతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రూ.56 కోట్ల మంచినీటి పథకాలకు ఆయన శంకుస్థాపన చేశారు. డీవీకే రోడ్డులో అన్నపూర్ణ క్యాంటీన్ ప్రారంభించారు. అనంతరం నల్లగొండ నుంచి నర్సింగ్‌భట్ల మీదుగా కురంపల్లి వరకు రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు గుండ్లపల్లిలో శంకుస్థాపన చేశారు. తిప్పర్తి మండలంలోని మామిడాల పీడబ్ల్యూ రోడ్డు నుంచి వయా చిరుమర్తి–మాడ్గులపల్లి వరకు రూ.రూ 44.76 కోట్లతో నిర్మించనున్న బీటీ డబుల్ రోడ్డు.. ఇండ్లూరు నుంచి చందనపల్లి వరకు రూ 26.5 కోట్లతో నిర్మించనున్న బీటీ డబుల్ రోడ్డు పనులకు.. గుర్రంపోడు మండలం లచ్చుగూడెం స్టేజీ నుంచి పాల్వాయి వరకు రూ.10 కోట్లతో చేపట్టనున్న 26 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ చుట్టూ బైపాస్ రోడ్డు నిర్మాణానికి వచ్చే నెలలోనే టెండర్లు పిలుస్తామన్నారు. ముషంపల్లి డబుల్ రోడ్డుకు రూ.100 కోట్లు ఇప్పటికే కేటాయించామని తెలిపారు. నల్లగొండ– దేవరకొండ రోడ్డును జాతీయ రహదారిగా మార్చేందుకు తాను కేంద్ర మంత్రికి ప్రతిపాదనలు ఇచ్చానని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ కాల్వ లైనింగ్ పనులను చేస్తున్నామని, సొరంగ మార్గం పనులు పూర్తి చేయడాని నిధులను మంజూరు చేయించామని చెప్పారు. పట్టణంలోని నిరుపేదలకు దేవరకొండ రోడ్ హౌసింగ్ బోర్డు వెనుక ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు అమలు చేసిందని, మిగిలిన ఒక గ్యారెంటీ కూడా ఈ నెల 11న అమలు చేస్తామన్నారు.

ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, వంగూరి లక్ష్మయ్య, ఎంపీపీలు సుమన్, విజయలక్ష్మీలింగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ కందుకూరి వెంకటేశ్వర్లు, కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, కౌన్సిలర్లు ఖయ్యూంబేగ్, అలకుంట్ల రాజేశ్వరీమోహన్‌బాబు, పర్హత్ ఫర్జానా ఇబ్రహీం, జెర్రిపోతుల అశ్వినీభాస్కర్‌గౌడ్, ఎడ్ల శ్రీనివాస్, గోగుల శ్రీనివాస్, కత్తుల శంకర్, ఎస్ఈ రాజేశ్వర్‌రెడ్డి, ఈఈ ఖాజన్ గౌడ్, డీఈ గణేశ్ కుమార్, ఏఈ పి.అనిత, మాజీ జడ్పీటీసీ గాలి రవి కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తగుళ్ల సర్వయ్య, నాయకులు గుమ్ముల మోహన్‌రెడ్డి, పాధూరి శ్రీనివాస్, రెడ్డి, జూకూరి రమేశ్, బద్దం సుధీర్, వెంకట్రాంరెడ్డి, సందీప్‌రెడ్డి, జేకే రాజు, సహదేవ్, జాకీర తాజ్, పనస శంకర్ గౌడ్, సుంకు ధనలక్ష్మి పాల్గొన్నారు.



బర్కత్‌పురలోని యాదగిరిభవన్‌లో అఖండజ్యోతి యాత్రను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు

# అఖండ జ్యోతి యాత్ర ప్రారంభం

- యాదగిరి గుట్ట ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు
- జ్యోతి వెలిగించి ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య
- నాలుగు రోజులపాటు సాగనున్న యాత్ర

యాదగిరిగుట్ట, మార్చి8 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని బర్కత్‌పుర యాదగిరిభవన్ నుంచి గురువారం ఉదయం 30వ అఖండ జ్యోతి యాత్రను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈవో రామకృష్ణారావు ప్రారంభించారు. యాదగిరి గుట్ట దేవస్థాన ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అఖండ జ్యోతి యాత్ర బర్కత్‌పుర యాదగిరిభవన్ నుంచి ప్రారంభమై ఉప్పల్, ఘట్‌కేసర్, బీబీనగర్, భువనగిరి, రాయగిరి మీదుగా ఈ నెల 11న సాయంత్రం యాదగిరి గుట్టకు చేరుకోనున్నది. 10వ తేదీ ఉదయం 9 గంటలకు మహంకాళి గుడి నుంచి బైపాస్ ద్వారా కొండమడుగు చౌరస్తా చేరుకోనున్నది. మధ్యాహ్నం బీబీనగర్ బాంబినో వద్ద భోజన విరామం. అక్కడి నుంచి గూడూరు, పగిడిపల్లి రామాలయం నుంచి భువనగిరి డాల్ఫిన్ హోటల్ వద్దకు చేరుకోనున్నది. సాయంత్రం 6.30 గంటలకు భువనగిరి పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద స్వాగత కమిటీ ఆధ్వర్యంలో ఘన స్వాగతం. అనంతరం పురవీధులు తిరుగుతూ బ్రహ్మంగారి దేవస్థానం, భువనగిరి కోట వద్దకు వస్తుంది. అక్కడి నుంచి వినాయక చౌరస్తా, పాత బస్టాండ్, సాయిబాబా దేవస్థానం నుంచి రాత్రి 9.30 గంటలకు పాత వివేరా హోటల్ వద్దకు చేరుకొని బస చేస్తుంది. 11న ఉదయం 9.30 గంటలకు పూజ అనంతరం అక్కడి నుంచి బయల్దేరి ఉదయం 11.30 గంటలకు రాయగిరి యాదగిరిగుట్ట దేవస్థాన కమాన్ వద్దకు చేరుకుంటుంది. అక్కడి భక్తుల ఘన స్వాగతం స్వీకరించి వడాయిగూడెం, గుండ్లపల్లి, యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. అక్కడి నుంచి పట్టణంలోని వైష్ణవ సమాఖ్య కార్యాలయం వద్ద ఆలయ అర్చకులు స్వాగతం పలికి వేదఘోషను పఠిస్తారు. రాత్రి 8.30 గంటలకు అఖండ జ్యోతి యాత్ర యాదగిరి కొండపైకి చేరుకుంటుంది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆలయ డీఈఓ దోర్బల భాస్కర్ శర్మ, ఏఈఓ రఘు, 30వ అఖండ జ్యోతి ఆహ్వాన సంఘం చైర్మన్ సద్ది వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడు ఎంపల్ల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

# పటేల్‌కు మొండిచెయ్యి

- నల్లగొండ ఎంపీ టికెట్ హామీని మరిచిన కాంగ్రెస్
- జానారెడ్డి కుమారుడు రఘువీర్‌కే ఎంపీ టికెట్

సూర్యాపేట, మార్చి 8 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ నాయకుడు పటేల్ రమేశ్‌రెడ్డికి ఆ పార్టీ మరోసారి మొండిచెయ్యి ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయనకు టికెట్ ఇవ్వని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎంపీ సీటు ఇస్తామని చెప్పింది. కానీ ఆ హామీని మరిచి ప్రస్తుతం ఆ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి జానారెడ్డి పెద్ద కుమారుడు రఘువీర్‌రెడ్డికి ఎంపీ టికెట్ కేటాయించింది. దాంతో రమేశ్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో ఏమైనా న్యాయం జరుగుతుందా అని ఆయన అనుచరులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 2018, 2023లో రెండు సార్లు అసెంబ్లీ ఎన్నికల్లో పటేల్ రమేశ్‌రెడ్డి సూర్యాపేట టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించినా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డికే దక్కింది. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ముందు రమేశ్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ఉన్న రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉండగా టికెట్ వస్తుందనే ధీమాతో ఉండగా దామోదర్‌రెడ్డికి వచ్చిన విషయం తెలిసిందే. ఆ సమయంలో తీవ్ర నిరాశతో ఉన్న రమేశ్‌రెడ్డి పార్టీ మారే యోచనలో ఉండగా ఆయనను బుజ్జగించేందుకు ఏఐసీసీ పరిశీలకులు రోహిత్ చౌదరి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మల్లు రవి సూర్యాపేటకు వచ్చారు. అప్పుడు రమేశ్‌రెడ్డి నివాసం వద్ద ఆయన అనుచరులు, మల్లు రవికి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నది. హైదరాబాద్ నుంచి ఢిల్లీ నేతలతో ఫోన్‌లో మాట్లాడించి రమేశ్‌రెడ్డిని బుజ్జగించారు. కచ్చితంగా ఎంపీ టిక్కెట్ ఖాయమవుతుందని, ఢిల్లీ పెద్దలతో మాట్లాడానని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తన లెటర్ ప్యాడ్‌పై రాసి ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో దామోదర్‌రెడ్డి తరఫున పటేల్ రమేశ్‌రెడ్డి ప్రచారం చేశారు. కానీ ప్రస్తుతం రఘువీర్‌రెడ్డికి ఎంపీ టికెట్ రావడం పట్ల రమేశ్‌రెడ్డి అనుచరులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీని, రేవంత్‌రెడ్డిని నమ్ముకున్న రమేశ్‌రెడ్డి భవిష్యత్‌కు ఎలాంటి భరోసా ఇచ్చినట్లుగా కనిపించడం లేదని, రానున్న రోజుల్లో ఏదో జరుగుతుందన్న ధీమా కూడా లేకుండా పోతుందని రమేశ్‌రెడ్డి అనుచరలు వాపోతున్నారు.



కుందూరు రఘువీర్‌రెడ్డి

## రఘువీర్‌కే నల్లగొండ ఎంపీ టిక్కెట్

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి పెద్ద కుమారుడు కుందూరు రఘువీర్‌రెడ్డికే నల్లగొండ ఎంపీ టికెట్ ఖరారు అయ్యింది. డిగ్రీ పూర్తి చేసిన రఘువీర్‌కు భార్య లక్ష్మి, కుమార్తె ఈశ్వాన్వి, కుమారుడు గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వ్యాపారాలు చేస్తూనే కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నారు. 2014, 2018లో పీసీసీ సభ్యుడిగా పని చేయగా, 2021 నుంచి పీసీసీ జనరల్ సెక్రటరీగా పార్టీలో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నాగార్జునసాగర్ నుంచి రఘువీర్ తమ్ముడు జయవీర్‌రెడ్డి శాసన సభ్యుడిగా విజయం సాధించారు.

## 10న ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్ష

సూర్యాపేట అర్బన్ మార్చి 8 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రవేశ పరీక్షకు జిల్లా నుంచి 380 దరఖాస్తులు వచ్చినట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ చిట్టిపాక రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10న జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 నుంచి ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్స్ డౌన్‌లోడ్ చేసుకొని పరీక్ష కేంద్రానికి అరగంట ముందు హాజరుకావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్‌లు అనుమతించరని తెలిపారు.

# ఐదు రకాల డిజైన్లలో యూనిఫామ్

- తరగతుల వారీగా బాలబాలికలకు ప్రత్యేకం
- వేసవిలోనే కుట్టించేలా విద్యాశాఖ చర్యలు
- పాఠశాలలు పునఃప్రారంభం నాటికి అందించే ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో 1.87 లక్షల మంది విద్యార్థులు..
- రూ.1.87 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



రామగిరి, మార్చి 8 : విద్యకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు కావాల్సినవన్నీ ఎప్పటికప్పుడు సమకూర్చుతున్నది. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉచితంగా యూనిఫామ్స్ అందిస్తుండగా వాటిని ముందస్తుగానే తయారు చేసే విధంగా చర్యలు చేపట్టింది. ఏప్రిల్‌లో బడులు ముగిసే నాటికి యూనిఫామ్ క్లాత్‌ను తెప్పించి వేసవి సెలవుల్లోనే కుట్టే విధంగా ప్రణాళిక రూపొందించింది. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే వీటిని అందుబాటులోకి తీసుకురానున్నది. 2024–25 సంవత్సరానికి బాలికలు, బాలురకు వివిధ రకాల డిజైన్లలో యూనిఫామ్స్‌ను స్టిచ్చింగ్ చేయించేందుకు సిద్ధమవుతున్నది. ఉమ్మడి నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,110 ప్రభుత్వ, మోడల్, కేజీబీవీ పాఠశాలల్లో 1.87,765 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సంబంధించి 11,38,788.75 మీటర్ల యూనిఫామ్ క్లాత్ అవసరం ఉండగా రాష్ట్ర చేనేత సహకార సంస్థ (టెస్కో) నుంచి సరఫరా చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు రూ.1,87,76,600 మంజూరు చేసింది. స్టిచ్చింగ్ బాధ్యతలను ఈ పర్యాయం సమభావన సంఘాలకు అప్పగించారు. జిల్లా కేంద్రాలకు చేరిన క్లాత్‌ను విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండలాల్లోని ఎంఆర్‌సీలకు చేరవేస్తారు. ఎంఈఓలు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందించగానే వాటిని సమభావన సంఘాలకు ఇచ్చి విద్యార్థులకు కొలతల ప్రకారం కుట్టించనున్నారు. ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫామ్స్ అందించనున్నారు.

### ఏ తరగతికి ఏ యూనిఫామ్ అంటే..

- విద్యార్థులకు తరగతి, వయస్సుల వారీగా ఐదు రకాల డిజైన్లలో బాల, బాలికలకు దుస్తుల కోడ్‌తో రంగు ఒకేలా ఉండేలా క్లాత్ సరఫరా చేయనున్నారు.
- 1 నుంచి 3వ తరగతి బాలికలకు కుడి వైపు ప్యాకెట్‌తో ఫ్రాక్, సూటింగ్ క్లాత్‌తో కుట్టిన బెల్టు, రింగులు రూపొందించనున్నారు. స్లీవ్‌లపై సూటింగ్ రంగు పట్టీలతో ముద్రించిన ఎరుపు, బూడిద రంగుల గీతలో షర్ట్స్ అందించనున్నారు.
- 4, 5వ తరగతి చదివే బాలికలకు రెండుప్యాకెట్‌లతో స్కర్ట్, దానిపై పట్టీలతో కూడిన షర్ట్స్ అందిస్తారు.
- 6నుంచి 10వ తరగతి బాలికలకు ఎరుపు, బూడిద రంగులో పంజాబీ శైలిలో స్టిచ్చింగ్ చేయించేలా ప్రణాళిక చేశారు.
- 1నుంచి 7వ తరగతి చదవే బాలురకు నిక్కరు(లాగు), షర్ట్స్ ఇస్తారు.
- 8నుంచి 10వ తరగతి బాలురకు ప్యాంట్, షర్ట్ మోడల్ డిజైన్లను అందించనున్నారు.

### విద్యార్థులు.. కేటాయించిన క్లాత్

| జిల్లా | పాఠశాలలు | విద్యార్థులు | | | మీటర్లలో క్లాత్ | మంజూరైన నిధులు |
|---|---|---|---|---|---|---|
| | | బాలురు | బాలికలు | మొత్తం | | |
| నల్లగొండ | 1,485 | 41,387 | 45,628 | 87,015 | 5,32,605.00 | రూ. 8,701,500 |
| సూర్యాపేట | 909 | 25,984 | 27,474 | 53,458 | 3,24,177.15 | రూ. 5,345,800 |
| యాదాద్రి భువనగిరి | 719 | 22,166 | 25,123 | 47,292 | 2,82,006.60 | రూ. 4,729,200 |
| మొత్తం | 3,113 | 89,537 | 98,228 | 18,7765 | 11,38,788.75 | రూ.18,776,500 |

### విద్యాశాఖ ఆదేశాలు అమలు చేస్తాం



ఆయా మండలాల్లోని పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర విద్యాశాఖ నుంచి వచ్చిన క్లాత్‌ను సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఎంఆర్‌సీలకు పంపిస్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు వేసవిలోనే స్టిచ్చింగ్ పూర్తి చేసి పాఠశాలల పునఃప్రారంభంనాటికి అందించేలా ప్రణాళికలు రూపొందించాం. ప్రభుత్వ నిబంధనలు అమలు చేసి అందరి సహకారంతో సర్కారు బడులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– బి.భిక్షపతి, డీఈఓ, నల్లగొండ

### ఎంపిక చేసిన డిజైన్స్‌లో స్టిచ్చింగ్



విద్యార్థులకు యూనిఫామ్ ఈ పర్యాయం ముందస్తుగానే సిద్ధం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నల్లగొండ జిల్లాలో 87,015 మంది విద్యార్థులకు అవసరమైన 5,32,605.00 మీటర్ల క్లాత్ టెస్కో నుంచి రానున్నది. దీనికి సంబంధించిన నిధులు రూ.87,01,500 ప్రభుత్వం నుంచి వచ్చాయి. ప్రభుత్వ చూపించిన డిజైన్లలో యూనిఫామ్స్ కుట్టించి విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

–వంగూరి వీరయ్య, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి, సమగ్రశిక్ష, నల్లగొండ

# పాలనలో పారదర్శకతతోనే అవినీతి నిర్మూలన

- సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వర్రె వెంకటేశ్వర్లు

కోదాడ టౌన్, మార్చి 8: ప్రభుత్వ పాలన పారదర్శకంగా అందేందుకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని సమాచార ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కమిషనర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని ఎమ్మెస్ కళాశాలలో సమాచార హక్కు వికాస సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో, రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులు అవినీతికి అస్కారం లేకుండా పని చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి పనులు జరిగినా, వెంటనే ఆర్టీఏ కార్యకర్తలు అవినీతిని బయటకు తీసుకురావాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఒంటెద్దు పోకడలను ప్రస్తుత సమాజంలో ఉన్న మేధావులు, యువకులు ప్రశ్నించాలన్నారు. అధికారులు లంచం అనే మాట ఎత్తితే వెంటనే ప్రజలు ఆర్టీఏ కార్యకర్తలకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు వికాస సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, జిల్లా ఉపాధ్యక్షుడు విక్టర్ బాబు, నియోజక వర్గ అధ్యక్షుడు ఏసు పాదం, జిల్లా సహాయ కార్యదర్శి కిన్నెర ఉపేందర్, కోదాడ పట్టణ అధ్యక్షుడు గంధం పాండు, కార్యదర్శి మాతంగి శ్రీను, నకిరేకంటి నాగేంద్రబాబు, రశీద్, పాతకోటి రామారావు పాల్గొన్నారు.